క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు కురుపాం మండలం నీలకంఠాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం.వరుణ్‌సందేశ్, ఎ.దీవాన్ ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం ఎ.గోవిందరావు, పీడీ పత్తిక చంద్రమోహన్ ఆదివారం తెలిపారు. ఈ నెల 27న గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తగూడ గ్రామంలోని జీటీడబ్ల్యూఏహెచ్(బాయ్స్)లో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో వీరు చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొనున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

సుదర్శన హోమం


సుదర్శన హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబ ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో రుత్వికులు నరసింహాచార్యులు భక్తులతో హోమ పూజలు చేయించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

'చదవడం మాకిష్టం'

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వాహకులు ఎన్.మధుసూదనరావు ఆధ్వర్యంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగత్‌సింగ్ జీవిత విశేషాల వివరించారు. నీతి కథలను చదివించడంతో పాటు చదరంగం, క్యారమ్స్ తదితర ఆటలు ఆడించారు.

గోతుల పూడ్చివేత

భామిని: మండలంలోని ఏబీ రోడ్డులో ఏర్పడిన గోతులు రోజురోజుకు పెద్దవి అవుతుండటంతో వాహన చోదకులకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు పడుతున్న అవస్థలను చూసి చలించిన ఎస్సై డి.అనీల్‌కుమార్ సిబ్బందితో కలిసి రోడ్డు గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. ఆదివారం వడ్డంగి క్వారీ నుంచి ట్రాక్టర్లతోగ్రావెల్ తెప్పించి సింగిడి నుంచి బత్తిలి వరకు రోడ్డు గోతులను పూడ్చారు.

వంద రోజులైనా అమలు కాని ఉచిత ఇసుక

సీతంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా ఇంతవరకు ఉచిత ఇసుక సరఫరా చేయకపోవడంపై సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇసుక కొరతతో ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నియోజకవర్గంలో రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకున్నవారు లేరన్నారు. హౌసింగ్ అధికారులు స్టాక్ పాయింట్ చూపించినా అక్కడ ఇసుక లేదన్నారు. ఇప్పటికైనా ఉచిత ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

పాలకొండ: మండలంలోని ఎం.సింగుపురం గ్రామం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన నారు రామినాయుడుతో పాటు గ్రామస్తులు డిపో మేనేజర్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ రహదారిలో బస్సు నడపడం వల్ల 14 గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. గతంలో ఆర్టీసీ బస్సు నడిపేవారని, ప్రస్తుతం బస్సును తీసి వేయడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

పోలీసుల స్పందన


రహదారి గోతులను పూడ్చివేయిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: పాలకొండ–విశాఖ రహదారిలో వీరఘట్టం కూడలి వద్ద ఏర్పడిన భారీ గోతులను పోలీసులు ఆదివారం పూడ్చివేయించారు. ఇటీవల సాక్షిలో 'రహదారి గోతులతో సమస్యలు' అనే శీర్షికతో వచ్చిన కథనంపై ఎస్ఐ కె.ప్రయోగమూర్తి స్పందించారు. ట్రాక్టర్లతో మట్టి, కంకర, కసరా బుగ్గిని తెప్పించి గోతులను పూడ్చారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు సాగించే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన చెస్ పోటీలు

పార్వతీపురం టౌన్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా స్థాయి ఉపాధ్యాయుల చెస్ పోటీలు నర్సిపురం జెడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం ముగిశాయి. విజేతగా నర్సిపురం జెడ్పీహెచ్ఎస్ పీడీ సబ్బాన మరళి, రన్నర్‌గా బి.బుచ్చిబాబు నిలిచారు. అక్టోబరు 4 నుంచి 6 వరకు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని యూటీఎఫ్ నాయకుడు మురళి తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం

- అక్టోబరు 3 నుంచి 12 వరకు ఉత్సవాలు
- ముస్తాబైన కోటదుర్గమ్మ ఆలయం
- తొమ్మిది రోజుల పాటు ఆలయంలో కుంకుమ పూజలు




దసరా ఉత్సవాలకు ముస్తాబైన కోటదుర్గతల్లి ఆలయం (ఇన్‌సెట్లో) వీరఘట్టం కోటదుర్గతల్లి

వీరఘట్టం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం, భక్తుల పాలిట కల్పవల్లి శ్రీకోటదుర్గతల్లి శరన్నవరాత్రి ఉత్సవాలను అక్టోబర్ 3 నుంచి 12 వరకు నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. యజ్ఞకర్త యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. గంగా, భవాని, గాయత్రి, కాళీ, చండీ, లక్ష్మి, సరస్వతి, రాజరాజేశ్వరి, లలితాదేవి అలంకరణలో అమ్మవారికి తొమ్మిది రోజులు పూజలు చేయనున్నారు. దశమి నాడు విజయదుర్గగా అమ్మవారిని అలంకరించి విశేష పూజలు చేయనున్నట్లు శర్మయాజీ తెలిపారు.

ఇదీ పూర్వ చరిత్ర..

వీరఘట్టం కోటదుర్గ తల్లి ఆలయానికి ఏళ్లనాటి చరిత్ర ఉందని పూర్వీకులు చెపుతున్నారు. అప్పట్లో వలస రాజుల పరిపాలనలో కోటలో వెలసిన దుర్గాదేవి ఈ రాజ్యాన్ని ఎంతో సుభిక్షంగా ఉంచేందుకు రాత్రులు ఊరిని పహారా కాసేవారని పెద్దలు చెపుతున్నారు. గజ్జెల సవ్వడితో ఊరి పొలిమేర్లలో తిరుగుతూ గ్రామంలోకి దుష్టశక్తులు రాకుండా కాపుకాచేవారని, అర్ధరాత్రి వేళ ఎవరైనా పని మీద బయటకు వస్తే వారికి వృద్ధురాలిగా కనిపించేవారని, యోగక్షేమాలు అడిగేవారని స్థానికులు అంటుంటారు. నేటికీ కూడా దుర్గగుడి సమీపంలో అర్ధరాత్రి వేళ గజ్జెల శబ్దం వినిపిస్తూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. శుభకార్యాలకు, ఉద్యోగాలకు, పరీక్షలకు హాజరయ్యేవారు తప్పకుండా కోటదుర్గను దర్శించుకొని వెళుతుంటారు.


మహిళలు కుంకుమ పూజలు చేసేందుకు వీలుగా సిద్ధం చేసిన ఆలయ ప్రాంగణం

ఆలయానికి నూతన శోభ..

వీరఘట్టం కోటదుర్గ ఆలయాన్ని అత్యాధునిక హంగులతో జిల్లాకే తలమానికంగా ఏడాది క్రితం పునఃనిర్మాణం చేశారు. ఏక శిలాయుత మకరతోరణ సింహవాహన పీఠస్థిత దుర్గా భవానీ విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు.

9 రోజుల పాటు కుంకుమ పూజలు..

శరన్నవరాత్రులు అక్టోబరు 3 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు నుంచి 11వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో మహిళలచే కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే తొలి రోజు 108 మంది భవానీ, సంతోషిమాత భక్తులు మాలాధారణ చేయనున్నారు. వీరిచే ప్రతీ రోజు అమ్మవారికి హోమం చేస్తారు. 12న విజయదశమి రోజున భక్తులందరూ అమ్మవారిని దర్శించుకున్న తర్వాత సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి తిరువీధి నిర్వహిస్తారు.

దేవి దర్శనం శుభకరం

దసరా మహోత్సవాల్లో శరన్నవరాత్రులు విశ్వస్వరూపిణి అయిన ఆ మహాశక్తిని దర్శించుకోవడం శుభకరం. మహిమ గల కోటదుర్గ దర్శనం ఎంతో పుణ్యఫలం. భక్తులు ఆ అమ్మవారిని ప్రశాంతంగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నాం. భక్తులంతా పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుతున్నాం. – యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ

ఆలయంలో అభివృద్ధి పనులు


కైలాసనాథ స్వామి ఆలయం ఆవరణలో చేపడుతున్న టైల్స్ పనులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కైలాసనాథ స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు సర్పంచ్ బి.గౌరీశంకరరావు తెలిపారు. ఈమేరకు రానున్న కార్తీక మాసంలోగా భక్తులకు ఆలయంలో సకల సౌకర్యాలు కల్పించే దిశగా ఆలయం ఆవరణలో మండపం నిర్మాణం, ఆలయం ప్రాంగణమంతా టైల్స్ ఏర్పాటు పనులను చేపడుతున్నట్లు చెప్పారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విష్ణు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, దోస్తీమేరా దోస్తీ సభ్యులు, గ్రామ పెద్దలు అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

3 నుంచి మల్లెమ్మతల్లి ఉత్సవాలు


మల్లెమ్మ తల్లి

సీతంపేట: మండలంలోని దారిమల్లి సమీపంలో ఉన్న మల్లెమ్మ తల్లి గుడి వద్ద దసరా ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చేనెల 3న ముహర్తపు రాట వేసి ఉత్సవాలు ప్రారంభించనున్నారు. ప్రతీ రోజు వివిధ పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 4న గాయత్రి దేవిగా, 5న అన్నపూర్ణాదేవిగా, 6న లలిత త్రిపురాసుందరిగా, 7న మహచండీదేవిగా, 8న మహలక్ష్మిగా, 9న సరస్వతిదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసుర మర్ధినిగా, 12న రాజరాజేశ్వరిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. దుర్గాష్టమి రోజున 108 కలశాలతో అమ్మవారికి పూజలు, భజన కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. దసరా రోజున మల్లెమ్మ తల్లి ఊరేగింపు ఉంటుందన్నారు.

పేకాట శిబిరంపై దాడి


పట్టుబడిన పేకాట రాయుళ్లు

గరుగుబిల్లి: పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు తెలిపిన వివరాలిలావున్నాయి. మండలంలోని ఉల్లిబద్ర గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడులు చేశారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.11,100లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసును నమోదు చేసి పార్వతీపురం మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

- ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్


కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ విజయనగరం జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చక్రి, గుమ్మలక్ష్మీపురం మండలం ప్రధాన కార్యదర్శి భవాన్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్‌లో సభ్యత్వ నమోదు కోసం తమ బృందం జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సందర్శించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలల్లో పలు సమస్యలను గుర్తించడం జరిగిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏఎన్ఎంలను, రాత్రి వేళల్లో విద్యార్థుల సంరక్షణ నిమిత్తం నైట్ వాచ్‌మేన్లను నియమించాల్సి ఉందని, సుమారు 300 నుంచి 500 మంది విద్యార్థులు చదువుతున్న ఆశ్రమ పాఠశాలలన్నింటిలో భోజనాలు సకాలంలో సమకూర్చేందుకు వీలుగా వర్కర్లను నియమించాల్సి ఉందని, రికార్డుల నిర్వహణ బాధ్యతలు చూసేందుకు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను కూడా నియమించాల్సి ఉందన్నారు. విద్యార్థులకు అన్ని తరగతులలో బోధన జరిగేలా సెబ్జెక్టు టీచర్ల ఖాళీలను భర్తి చేయాల్సి ఉందని, విద్యార్థులకు సరిపడ్డ వసతి గృహ భవనాలు, భోజన శాలలు నిర్మించాల్సి ఉందన్నారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి గిరిజన విద్యాభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు భారతి, రామకృష్ణ, అశోక్, చిన్ని, నరేంద్ర తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాలలో 1992 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 32 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. అక్టోబరు 20న పూర్తిస్థాయిలో అందరం కలుసుకుందామని, ఆరోజున అందరి అభిప్రాయంతో భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుందామని, పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు.

ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న హోలీక్రాస్ సంస్థ డైరెక్టర్ ప్రభుదాస్

భామిని: మండలంలోని సింగిడి కళ్యాణ మండపంలో ఆదివారం హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ ఆధ్వర్యంలో లిట్ క్లబ్ సభ్యులైన బాలికలకు ఆత్మవిశ్వాసంపై సమ్మిట్ నిర్వహించారు. భవిష్యత్తులో అభివృద్ధి, ఉన్నత స్థానాలకు చేరాలంటే ముందుగా బాలికలు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఆత్మనూన్యత లేకుండా మనోనిబ్బరంతో చదువు కొనసాగిస్తేనే గమ్యం చేరుకుంటారన్నారు. అనంతరం విద్యార్థులకు బృంద చర్చ నిర్వహించారు. లిట్ క్లబ్ సభ్యులు, మెంటర్లు పాల్గొన్నారు.

ఈ మలుపు.. ప్రమాదాలకు పిలుపు


అట్టలి వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి మలుపు

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామం వద్ద గల భారీ మలుపు నిత్యం ప్రమాదాలకు పిలుపుగా మారింది. పాలకొండ నుంచి వీరఘట్టం వయా పార్వతీపురం వెళ్లే రహదారిలో అట్టలి వద్ద ఉన్న ఈ మలుపులో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున చెట్లు ఉండడంతో ఎదురుగా వచ్చిన వాహనాలను గుర్తించలేక పరస్పరం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు అక్కడే రహదారి కూడా ఛిద్రం కావడం సమస్య మరింత జఠిలంగా మారింది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు అధికమయ్యావి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహన దారులు కోరుతున్నారు.

నిర్వహణ గ్రాంట్స్ విడుదల చేయాలి

పార్వతీపురంటౌన్: మండల విద్యాశాఖ కార్యాలయాల నిర్వహణ గ్రాంట్స్‌ను సత్వరమే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌కు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ నిధులు (ఎమ్మార్సీ గ్రాంట్స్) గత రెండేళ్ల నుంచి విడుదల కాలేదన్నారు. ఇందువల్ల ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ ఖర్చుల భారంతో ఎంఈఓలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. శాఖా పరంగా ఎటువంటి నిధులు రానప్పటికీ ఎంఈఓలు అన్ని ప్రభుత్వ విద్యా పథకాల నిర్వహణ కోసం , వివిధ సమావేశాలకు సొంత డబ్బులు ఖర్చు చేసి ఆయా కార్యక్రమాలు విజయవంతం చేస్తున్నారని చెప్పారు. ఇటీవల విద్యా శాఖ నిమిత్తం రూ.413 కోట్ల 46 లక్షల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, ఆ నిధులనుంచైనా ఎంఈఓ కార్యాలయాల నిర్వహణకు నిధులను సర్దుబాటు చేసినట్లయితే ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. కార్యాలయం నిర్వహణ ఖర్చులు అధికంగా పెరిగిన దృష్ట్యా నిర్వహణ గ్రాంట్ ఈ ఏడాది నుంచి రూ. రెండు లక్షలకు పెంపుదల చేసి, విడుదల చేయాలని లేఖలో విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం పేర్కొన్నారు.

గోగు సాగులో యాజమాన్య పద్ధతులు


పెద్దూరులో సాగులో ఉన్న గోగుపంట

గరుగుబిల్లి: గోగుపంట ఊరవేతలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన నార ఉత్పత్తి కావడంతో పాటు మంచి ధరను పొందేందుకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. నాణ్యమైన గోగునార పొందేందుకు సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. గోగునార రెండు దశలలో ఉత్పత్తి అవుతుందన్నారు. గోగుపంట ప్రారంభం నుంచి కోతకు వచ్చే వరకు ఒక దశ, కోత కోసిన తర్వాత ఇంటికి వచ్చేవరకు రెండో దశగా పేర్కొనవచ్చు. ఇందులో రెండో దశ అత్యంత కీలకమైందన్నారు. దిగుబడి ఎంత వచ్చినా నాణ్యత లేకపోతే మంచి ధర వచ్చే అవకాశాలు ఉండవని రైతులు గమనించాలన్నారు. గోగు సాగులో కీలకమైన రెండో దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

- విత్తనాలు వేసిన 130 రోజులకు పంట కోతకు వస్తుంది. పంట 50 శాతం వరకు పూతకు వచ్చినప్పుడు పంటను తీస్తే మంచి దిగుబడి వస్తుంది.
- గోగుపంటను మొదళ్లతో తీయడం వల్ల నార నాణ్యత తగ్గుతుంది. మొదళ్లను భూమికి సమానంగా కోయాలి.
- గోగు కర్రలు ఊరవేసే ముందు నీటిలో నిలువుగా మొదళ్లు తడిసేలా ఉంచాలి. తరువాత అడ్డంగా చెరువులలో, వాగులలో ఊరవేయాలి.
- చెరువులలో ఊరవేసేటప్పుడు మట్టిదిబ్బలు కాకుండా రాళ్లు కానీ, సిమ్మెంట్ దిమ్మలు కాని వేసుకోవాలి.
- ఊరవేతకు ముందు యూరియా ద్రావణాన్ని గోగుకర్రలు తడిసేలా పిచికారిచేస్తే నాణ్యమైన దిగుబడివస్తుంది.
- నీరు స్వచ్ఛత, ఉదజని సూచిక వాతావరణ పరిస్థితులను బట్టి రెండు వారాల్లోగా గోగుకర్రలు ఊరతాయి.
- కర్రల నుంచి వేరుచేసిన గోగు నారను స్వచ్ఛమైన నీటిలో శుభ్రపరచాలి. ఉతికిన నారను ఎండలో ఆరబెట్టాలి. లేదంటే రంగు మారిపోయి నాణ్యత తగ్గిపోతుంది.

విరాళం అందజేత

పాలకొండ: కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల్లో నిత్య అన్నదానం పథకం కోసం పట్టణానికి చెందిన పల్లా కొండలరావు రూ.5 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం ఉత్సవ కమిటీకి అందించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఐదు వేల మందికి అన్నదానం చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: వాహన చోదకులు నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చునని ఎస్ఐ కె.ప్రయోగమూర్తి అన్నారు. పాలకొండ–సీతంపేట రహదారిలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహన చోదకులు హెల్మెట్లను, సీటు బెల్ట్‌ను ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వొద్దని, తల్లిదండ్రులు కూడా ఈ విషయమై బాధ్యతగా ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో, సరైన వాహన ధృవపత్రాలు, లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి అపరాధ రుసుం విధించారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

సాలూరు: రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా పట్టణ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుదల చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమవుతోందన్నారు. వాహనాలను నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని స్పష్టం చేశారు. నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేస్తే అపరాధ రుసుము విధించనున్నట్లు హెచ్చరించారు.

ఆత్మీయ సమ్మేళనం


1995-96 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొమరాడ: మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1995–96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రామచంద్రరెడ్డి, బి.గంగునాయుడు, శివరామప్రసాదరావు, బి.తిరుపతిరావు, పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గున్నారు.

హడలెత్తిస్తున్న వీధికుక్కలు


వీధుల్లో సంచరిస్తున్న కుక్కల గుంపు

పాలకొండ రూరల్: పట్టణంలోని 20 వార్డుల్లో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. గడచిన నెలరోజులుగా వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎక్కడ చూసినా శునకాల గుంపులు కనిపిస్తున్నాయి. దారినపోయే పాదచారులు, వాహన చోదకులపై దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా వెళ్లే చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. వీధుల్లో ఒంటరిగా వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై దిగబడిన లారీ

భామిని: మండలంలో రోడ్డు కష్టాలు కొనసాగుతున్నాయి. దిమ్మిడిజోల–అనంతగిరి మధ్య ఏబీ రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో ఆదివారం ఒడిశా నుంచి వస్తున్న ఇసుక లారీ దిగబడిపోయింది. రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జేసీబీ సాయంతో లారీని అక్కడ నుంచి బయటకు తీయడంతో వాహనాలు ముందుకు కదిలాయి.


ఏబీ రోడ్డుపై దిగబడిన ఇసుక లారీ